# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ముందస్తు పంపిణీ



**: రూ.103.16 కోట్ల పెన్షన్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేత**

**కర్నూలు, జనవరి 31, ప్రభాతవార్త :**
ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద ఫిబ్రవరి మాసానికి జిల్లాలో అర్హులైన 2,36,675 మంది లబ్ధిదారులకు రూ.103.16 కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. సిరి తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పెన్షన్లను ఒక రోజు ముందుగానే పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో శనివారం కర్నూలు నగరంలోని కొత్తపేట ప్రాంతంలో షేక్ గౌసియా, షేక్ తహేరలకు వితంతువు పెన్షన్లు, పార్వతీ, అబ్దుల్ మజీద్‌లకు వృద్ధాప్య పెన్షన్లు, పద్మావతికి ఒంటరి మహిళ పెన్షన్‌ను వారి ఇంటి వద్దకే వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, పెన్షన్లు ప్రతి నెలా సకాలంలో ఇంటి వద్దకే అందుతున్నాయా అని ఆరా తీశారు. ఇంటి వద్దకే పెన్షన్ అందుతోందని లబ్ధిదారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డిఆర్డిఎ పిడి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత రమేష్.. దారుణ హత్య..!

- ట్రాక్టర్‌తో ఢీకొట్టి రాళ్లతో దాడి చేసిన గుర్తు తెలియని దుండగులు
- పదిమందికి పైగా దాడిలో పాల్గొన్నట్లు అనుచరుల ఆరోపణ
- కర్నూలు కలెక్టరేట్ ముందు మృతదేహంతో ధర్నా
- రెండు గంటలు ట్రాఫిక్ స్తంభనం





**కర్నూలు జిల్లా బొందిమడుగుల గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందిమడుగుల రమేష్ శుక్రవారం సాయంత్రం దారుణ హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని దుండగులు ట్రాక్టర్‌తో ఢీకొట్టి అనంతరం రాళ్లతో దాడి చేయడంతో ఆయన మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనలో పదిమందికి పైగా దుండగులు పాల్గొని ఉండవచ్చని రమేష్ అనుచరులు ఆరోపిస్తున్నారు. ఈ హత్యకు నిరసనగా శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కర్నూలు నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద దళిత సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. రమేష్ మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి ధర్నా చేయడంతో సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది.**

**కర్నూలు, జనవరి 31, ప్రభాతవార్త :**
పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు భారీగా చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ప్రయత్నించారు. కలెక్టర్ లేదా జిల్లా ఎస్పీ స్వయంగా అక్కడికి వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. అయితే కలెక్టర్, జిల్లా ఎస్పీ ఇద్దరూ అందుబాటులో లేకపోవడంతో నిరసనకారులు మూడు గంటలపాటు రోడ్డుపై బైఠాయించారు. అదే సమయంలో పత్తికొండ పోలీసులపై వివిధ ఆరోపణలతో నినాదాలు చేస్తూ, పోలీసులు దళితుల పట్ల వివక్షతో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. దళితులపై రోజు రోజుకీ దాడులు పెరుగుతున్నాయని దళిత సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ ఉద్యమంలో రాష్ట్రవ్యాప్తంగా రమేష్ కీలకపాత్ర పోషించారని పేర్కొంటూ, ఈ ఘాతుకానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలంటూ ఎంఆర్‌పీఎస్ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు కలెక్టర్ కార్యాలయం ముందుకు దూసుకెళ్లి ఆందోళనను కొనసాగించారు.

# వెట్టి చాకిరి నుంచి.. 21 మందికి విముక్తి..!

**- ప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతమైన రెస్క్యూ ఆపరేషన్ : ఆదోని సబ్ కలెక్టర్**



**ఆదోని క్రైమ్ జనవరి 31, ప్రభాతవార్త :**
కర్నూలు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వెట్టి చాకిరి (బాండెడ్ లేబర్) నుంచి 21 మందిని విముక్తి చేయడం జరిగిందని ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆదోని సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదోని మండలం కపటి గ్రామంలో గత మూడు నెలలుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన 21 మంది ఇటుకల బట్టీలలో వెట్టి చాకిరి పరిస్థితుల్లో పనిచేస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. వీరిలో 16 మంది పెద్దలు కాగా, అందులో పురుషులు 7 మంది, మహిళలు 9 మంది ఉన్నారని చెప్పారు. అదే విధంగా 5 మంది మైనర్లు ఉండగా, అందులో ఒకబాలుడు, నాలుగు బాలికలు ఉన్నారని వివరించారు. ఇటుకల బట్టీలో పని చేయించేందుకు ముందుగా కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చి, అనంతరం వారిని తీవ్రంగా బాధితులను సురక్షితంగా విడుదల చేయడం జరిగిందన్నారు. విడుదలైన వారందరికీ ప్రభుత్వం తరఫున రిలీజ్ సర్టిఫికెట్లు అందజేసినట్టు తెలిపారు. బాధితులకు రావలసిన వేతనాలు పూర్తిస్థాయిలో చెల్లించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్టు, వారి సొంత ప్రాంతాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. వెట్టి చాకిరి నేరమని, ఇటువంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, ఎవరైనా ఈ విధమైన అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి ఘటనలు గమనిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా లేబర్ డిపార్ట్మెంట్ తరచుగా తనిఖీలు నిర్వహించాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు.



# ఏపీలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు

**: నెయ్యి కల్తీ చేసినందుకే వైసీపీ వాదనలు : మంత్రి టీజీ**



**కర్నూలు హాస్పిటల్ జనవరి 31 ప్రభాతవార్త :**
ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్లు అధిక మొత్తంలో, సమయానికి అందిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని 52వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. మీడియాతో మాట్లాడుతూ, ప్రతి నెల 1వతేదీన సెలవు ఉంటే ముందురోజే పింఛన్లు అందజేస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. తిరుమల నెయ్యిలో కల్తీ జరిగిందని, అందుకే వైసీపీ నేతలు వాదనలకు దిగుతున్నారని మంత్రి ఆరోపించారు. తప్పు చేసిన వారు వెంకటేశ్వర స్వామిని క్షమాపణలు కోరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- జిల్లెలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణి
- గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల, జనవరి 31, ప్రభాతవార్త ప్రతినిధిః**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వివిధ రకాల పెన్షన్లు పంపిణి చేస్తుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రివి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శనివారం నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లెల గ్రామంలో జిల్లా కలెక్టర్ జి రాజకుమారితో కలిసి మంత్రి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో జేసి కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈసందర ్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 1వ తేదినే పెన్షన్ మొత్తాలను లబ్దిదారుల ఇంటివద్దకే అందజేస్తుందన్నారు. ఒకటవతేది ఆదివారం అయితే ఒకరోజు ముందుగా పెన్షన్లు పంపిణి చేయడం జరుగుతోందన్నారు. వృద్దులు, వికలాంగులు, వితంతువులకు నెలకు రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.10 వేల చొప్పున పెన్షన్లు నిరంతరాయంగా అందిస్తున్నామన్నారు. జిల్లెల గ్రామంలో తాగునీటి సమస్య చెరువు పునరుద్దరణ అంశాలపై ప్రత్యేక దృష్టిసారించి తగిన చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. రజకులు ఇబ్బంది పడకుండా చెరువుకు సంబంధించిన సమస్యలను సమగ్రంగా పరిష్కరిస్తామన్నారు. రోడ్ల విస్తరణలో భాగంగా పునరావాసం కల్పించడంతో పాటు నష్టపరిహారం కూడ అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాభివృద్ధికి అధికారులు ప్రజలు కలిసి కట్టుగా పనిచేయాలని గ్రామ పెద్దలను కోరారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన లబ్దిదారులకు చేరేలా అధికారులు కృషిచేస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా పేద కుటుంబాలకు ఆరి ్థక భరోసా లభిస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్య పరిష్కారం చెరువుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సంబంధిత శాఖల ద్వారా సమీక్షించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ.. మ్మార్పియస్ నాయకుడు మృతి

**- కర్నూలు మౌర్య ఆస్పటల్ లో చికిత్స పొదుతూ..**
**మృతి చెందిన ఎమ్మార్పియస్ నాయకుడు**
**- నేలకు ఒరిగిన దళిత ఉద్యమ నేత**

**తుగ్గలి, జనవరి 31, ప్రభాతవార్త:**
దళిత జాతి ముద్దు బిడ్డ ఉద్యమాల పోరాటయోదుడు, ఎంతో మంది యువతను ఉద్యమ బాటలో నడిపిన గొప్పమార్గ దర్శి అణగారిన వర్గల హాక్కుల కోసం ఒన్నో బడిదుడుకులు ఎదురైనా మాదిగల ఆత్మగౌరవం కోసం పోరాడిన ఎమ్మార్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ బొందిమడుగుల టి.ఎం.రమేష్ మాదిగ కర్నూలు చికిత్స పొందుతు కోలుకోలేక మృత్యువుతో పోరాడి మరణించారు. తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామానికి చెందిన టిఎం రమేష్ మాదిగ శుక్రవారం సాయంత్రం బొందిరాళ్ళకు వెళ్ళే రోడ్డు మార్గం గుండా నడిచి వెళుతుండగా అదే గ్రామానికి చెందిన కొంత మంది ప్రత్యర్థులు అయనను హాతం చేయాలని ఉద్దేశ్యంతోట్రాక్టర్తఓ ఢీకొట్టి ఆపై ఇనుపరాడ్లతో కొట్టి తీవ్రంగా గాయపరచగా సృహా తప్పిపడిపోయియాడని చికిత్స పొందుతు మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలియడంతో పలువురు భాధ్యులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



# సీఎం చంద్రబాబు.. దుష్ప్రచారం మానుకోవాలి.

**: ఆదోనిలో వైఎస్సార్‌సీపీ శుద్ధి-సంప్రోక్ష**



**ఆదోని క్రైమ్ జనవరి 31 ప్రభాతవార్త :**
తిరుమల లడ్డూ ప్రసాదంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ మాజీ ఎమ్మెల్యే వై. సాయిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఇంద్రనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుద్ధి-సంప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లడ్డూ కల్తీ అంశాన్ని తెరపైకి తెచ్చి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు ఎటువంటి ఆధారాలు లేవని ల్యాబ్ నివేదికలు చెబుతున్నా, కూటమి ప్రభుత్వం కావాలనే విషప్రచారం అదేవిధంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి క్రిస్టియన్ మత అని రాజకీయాలు చేస్తున్నారు మండిపడ్డారు. అదేవిధంగా లోకేష్‌ను సీఎం చేయాలని నారా చంద్రబాబు నాయుడు ఆత్రుత పడుతున్నారు, ఆరోగ్యం ప్రసాదించాలని మంచి బుద్ధి సత్ప్రవర్తన తో మెలగాలని, రాజకీయాల కోసం దేవుడిని వాడుకోవడం బాధాకరమని, ప్రజలెవరూ ఈ అబద్ధపు ప్రచారాలను నమ్మవద్దని ఆయన కోరారు. వైఎస్ఆర్సిపి నాయకులు చంద్రకాంత్ రెడ్డి, చైర్మన్ లోకేశ్వరి, వెంకటేశ్వర్ రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శిరివెళ్లలో గంజాయి అక్రమ రవాణాపై.. పోలీసుల దాడి..!

**- ఐదు మంది అరెస్టు**
**- 6 కిలోల గంజాయి స్వాధీనం**



**నంద్యాల, జనవరి 31, ప్రభాతవార్త ప్రతినిధిః**
జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు అదేశాల మేరకు ఆళ్లగడ్డ డిఎస్పీ ్ర సూచన మేరకు శిరివెళ్ళ సర్కిల్ సిఐ రాము ఆద ్వర్యంలో గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి ఏర్పాటు చేశారు. ఈక్రమంలో శిరివెళ్ళ పోలీస్‌స్టేషన్ ఇంచార్జీ ఎస్ఐ జయప్పకు అందిన సమాచారం మేరకు శిరివెళ్ళ మండలం బోయలకుంట్ల గ్రామానికి చెందిన జింకల మద్దిలేటి (ఏ-1)వద్దకు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కోడూరు శ్రీనివాస్ (ఏ2) గంజాయి తీసుకొని బోయటకుంట్ల గ్రామ సమీపంలో ఉన్న కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్దకు వస్తాడని తెలిసింది. దీంతో 30వ తేది సాయంత్రం ఎస్ఐ జయప్ప వారి సిబ్బందితో కలిసి బోయకుంట్ల గ్రామ సమీపంలోని కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్దకు వెళ్లారు. అక్కడ ఐదుగురు వ్యక్తులు గంజాయి ప్యాక్‌చేసి అక్రమంగా రవాణాచేసేందుకు సిద్దంగా మాట్లాడుకుంటుండగా వారిని పట్టుకొని తనిఖీచేయగా జింకల మద్దిలేటి వద్ద 2 కేజిల గంజాయి, కోడూరు శ్రీనివాస్ వద్ద కేజి గంజాయి, దండబోయిన గురుస్వామి (ఏ3) వద్ద కిలో గంజాయి, షేక్ అబ్దుల్ నబీ (ఏ4) వద్ద కిలో గంజాయి, మొఘల్ గఫార్ (ఏ5) వద్ద కిలో గంజాయి మొత్తం 6 కిలోలు స్వాధీనం చేసుకొని ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేయడం జరిగింది. విచారణలో ఏ1 జింకల మద్దిలేటిపై ఇప్పటికే కృష్ణాజిల్లా అవనిగడ్డ పిఎస్, ఢిల్లీ, నంద్యాల జిల్లా మహానంది పీఎస్, నంద్యాల తాలూక పీఎస్‌లలో మొత్తం 4 గంజాయి కేసులు నమోదు అయినట్లు ఉంది. గతంలో ఇతను ఒరిస్సా నుండి గంజాయి తెచ్చేవాడు ఆ క్రమంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కోడూరు శ్రీనివాస్ పరిచయం అయ్యాడు. ప్రస్తుతం అదే పరిచయంతో కోడూరు శ్రీనివాస్ ద్వారా ఒరిస్సా నుండి గంజాయి సరఫరా చేసుకుంటున్నట్లు విచారణలో వెల్లడయింద న్నారు. ఈసందర ్భంగా ఆళ్లగడ్డ డిఎస్పీ కె ప్రమోద్ ఆల్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై రౌడీ షీటర్లు, మరియు అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకొని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

# కూటమి చేతిలో.. కమిషనర్ కీలుబొమ్మ

**: మున్సిపల్ వైస్ చైర్మన్ ఆగ్రహం**



**ఆదోని క్రైమ్ జనవరి 31, ప్రభాతవార్త :**
ఆదోని మున్సిపల్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు మధ్య ఉన్న విభేదాలు శనివారం మరోసారి బహిర్గతమయ్యాయి. మున్సిపల్ కమిషనర్ కృష్ణ వ్యవహరిస్తున్న తీరు పై వైస్ చైర్మన్ నర్సింహులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కౌన్సిల్ సమావేశంలో అధికారికంగా ఆమోదించిన అభివృద్ధి పనులను పట్టించుకోకుండా, ప్రజలు పన్నులు చెల్లించడం లేదనే సాకుతో నిధుల కొరతను సాకుగా చూపడంపై ఆయన మండిపడ్డారు. కమిషనర్ కేవలం అధికార కూటమికి కీలుబొమ్మలా మారి, కౌన్సిల్ నిర్ణయాలను కాలరాస్తున్నారని నర్సింహులు ఆరోపించారు. కనీసం కౌన్సిల్ తీర్మానం కూడా లేకుండా అధికారులు సొంత నిర్ణయాలతో పనులు చేపడుతున్నారని, ఇది నిబంధనలకు విరుద్ధమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కమిషనర్ కార్యాలయంలో వైస్ చైర్మన్‌కు, మున్సిపల్ అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా తీసుకున్న నిర్ణయాలను అమలు చేయకపోవడం సరికాదని ఆయన హెచ్చరించారు.

# కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడిగా మల్లికార్జున యాదవ్

**: ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరీగా నియామకం**

**కర్నూలు, జనవరి 31, ప్రభాతవార్త :**
కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబిసి విభాగం విభాగం రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా కర్నూలు చెందిన మల్లికార్జున యాదవ్ ను నియమించారు. ఓబిసి సెల్ చైర్మన్ సొంటి నాగరాజు అధికారికంగా ప్రకటించారు. కర్నూల్ నగరంలో పాత్రికేయుడుగా అందరికీ సుపరిచితమైన మల్లికార్జున యాదవ్ కు కాంగ్రెస్ పార్టీలో రాష్ట్రస్థాయి పదవి రావడంతో జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా కర్నూలు, ఆదోని డివిజన్లకు చెందిన రాజకీయ నాయకులు, సామాజిక వర్గ నేతలు అభినందించారు. అదేవిధంగా ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

# గంజాయి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేస్తాం : జిల్లా ఎస్పీ

**- పట్టుబడిన గంజాయి, నిషేధిత పదర్థాలు ధ్వంసం**



**గడివేముల, జనవరి 31, ప్రభాతవార్త;**
జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేస్తామని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు స్టేషన్‌లలో సీజ్ చేయబడిన గంజాయి (122.574 కేజీలు) నిషేధిత పదార్థాలను ధ్వంసం చేశారు. శనివారం గడివేముల మండలంలోని జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ కర్మాగారం వద్ద గల బర్నింగ్ మిషన్‌లో వేసి కాల్చి వేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ యువత గంజాయి, మత్తు పదార్థాకలు దూరంగా ఉండాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. గంజాయి, మత్తు పదార్థాలను తరలించే వారి వివరాలను ప్రజలు తమకు తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ యుగంధర్‌బాబు, పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ, తహసీల్దార్, జేఎస్‌డబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# వెట్టి చాకిరి నుంచి 21 మందికి విముక్తి కల్పించిన అధికారులు

– ప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతమైన రెస్క్యూ ఆపరేషన్ – ఆదోని సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్



**ఆదోనిలీగల్, జనవరి 31, ప్రభాతవార్త;** వెట్టి చాకిరి (బాండెడ్ లేబర్) నుంచి 21 మందిని విముక్తి చేయడం జరిగిందని ఆదోని ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు... గత మూడు నెలలుగా ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన 21 మంది మండలంలోని కపటి గ్రామ శివారులోని ఓ ఇటుకల బట్టీలో వెట్టి చాకిరి చేస్తున్నారు. వీరిలో 16 మంది పెద్దలు కాగా, అందులో పురుషులు 7 మంది, మహిళలు 9 మంది ఉన్నారు. అలాగే 5 మంది మైనర్లు ఉండగా, అందులో ఒక బాలుడు, నలుగురు బాలికలు ఉన్నారని వివరించారు. ఇటుకల బట్టీలో పని చేయించేందుకు ముందుగా కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చి, అనంతరం వారిని తీవ్రంగా వెట్టి చాకిరి చేయించేవారు. వారిని సురక్షితంగా విడుదల చేసినట్లు తెలిపారు. విడుదలైన వారందరికీ ప్రభుత్వం నుంచి రిలీజ్ సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు. అలాగే బాధితులకు రావాల్సిన వేతనాలు పూర్తి స్థాయిలో చెల్లించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలెఇపారు. వారిని సొంత ప్రాంతాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇటువంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, ఎవరైనా ఈవిధమైన అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రమోలేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి విరాళం



**ఆదోని క్రైమ్, జనవరి 31, ప్రభాతవార్త :** ఆదోని పట్టణంలోని శ్రీ కోట చంద్రమోలేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న రాతి ముఖ మండవం కొరకు విరాళం ఇచ్చిన వెంకటేశ్వర్లు ధర్మపత్ని పుష్పాలత, వారి కుమారుడు డాక్టర్ నాగరాజ్ ,కుముదా కలిసి రూ. 2,11,000 నగదును ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. దైవ కార్యానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భారీ ఆర్థిక సాయం అందించిన వెంకటేశ్వర్లు కుటుంబాన్ని కి ప్రత్యేకంగా అభినందిస్తూ శాలువాతో సన్మానించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు వారి కుటుంబం ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.

## రైతులు ఆయిల్ ఫామ్ పంటల సాగుపై మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

: ఆత్మకూరు ఉద్యాన శాఖ అధికారిని చందన

: మార్కెట్ యార్డ్ లో రైతులకు ఉద్యాన పంటలపై అవగాహ



**ఆత్మకూరు, జనవరి 31, ప్రభాతవార్త :** రైతులు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించుకుంటే అధిక దిగుబడులు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆత్మకూరు ఉద్యాన శాఖ అధికారిని కే చందన తెలిపారు శనివారం పట్టణంలోని మార్కెట్ యార్డ్ లో ఆయిల్ పామ్ పంట మీద రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాములపాడు, కొత్తపల్లి,వెలుగోడు, మండలాలకు సంబంధించిన రైతులు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి శాస్త్రవేత్త .రాఘవేంద్ర మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట సాగు రైతులకు కొత్తది కావడం వలన రైతులు అన్ని రకాలుగా ఈ పంట పైన అవగాహన కలిగించుకోవడం ఎంతో అవసరం అని చెప్పారు. మొక్క నాటేటప్పుడు కార్బోఫ్యూరాన్ గుళికలు, వేప పిండి, ఎస్. ఎస్.పి తప్పకుండా వేసుకోవాలి. మొక్కలు నాటుకున్న మూడు నెలల తర్వాత మాత్రమే ఎరువులని సూచించిన మోతాదులో యూరియా 850 గ్రాములు, ఎస్ ఎస్ పి 1200 గ్రాములు, పొటాష్ 650 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 125 గ్రాములు, బోరాన్ 25 గ్రాములు చొప్పున ఒక్కొక్క మొక్కకి రెండు దఫాలుగా వేసుకోవాలి. కొమ్ము పురుగులు ఆశించకుండా ఉండేందుకు పొలంలో ఎరువు కుప్పలు శుభ్రంగా ఉంచుకోవాలి. ఆకులపై బ్యాక్టీరియా తెగులు ఆశించడం కనపడుతుంది. నివారణకు 10 లీటర్ల నీటికి కార్బెండజిమ్ 10గ్రా ప్లాంటామైసిన్ 1గ్రా కలిపి పిచికారి చేసుకోవాలి. బూజు తెగులు ఆశించినట్లయితే కోనిక 1.5మి లీటర్ నీటికీ చొప్పున పిచికారి చేసుకోవాలి. ఉద్యాన శాఖ తరపున ఆయిల్ పామ్ మొక్కలకి హెక్టార్ కి 10,500 రూపాయలు సబ్సిడీ అందిస్తున్నామని ఆత్మకూరు ఉద్యాన శాఖ అధికారిణి కె చందన తెలిపారు. రైతులకు సబ్సిడీలో స్ప్రేయర్లు, ప్లాస్టిక్ ప్లేట్లు కలవని తెలిపారు. పతాంజలి కంపెనీ మేనేజర్ ఎస్. రమణారెడ్డి, నవభారత్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ పి. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రైతుల దగ్గర నుంచి తామే కొంటామని, కనీసం మద్దతు ధర తప్పక చెల్లిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ సెక్రటరీ వై.వీ. సుబ్బారెడ్డి , హార్టికల్చర్ ఎంపీఈఓ సి. కృష్ణ కిషోర్, పతాంజలి స్టాఫ్ మోనిక, రవళి, ప్రసాద్, రవి, మధు, నవభారత్ స్టాఫ్ సుబ్బయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ అట్రాసిటి చట్టంపై అవగాహన అవసరం



**గోనెగండ్ల, జనవరి 31, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరికి ఎస్సీ ఎస్టీ చట్టాలపై అవగాహన ఎంతో అవసరం అని తహశీల్దార్ రాజేశ్వరి అన్నారు. శనివారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్సీ కాలనీలో ఎస్సీ ఎస్టీ కేసులు, అట్రాసిటి చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ జస్టీస్ పున్నయ్య కమీషన్ సిఫారస్‌ల మేరకు సమాజంలో సాంఘిక దురాచారాలు,రూపుమాపడం కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.భారత రాజ్యాంగం ఆర్టికల్ 17 ప్రకారం అంటరాని తనం నిషేధించడం జరిగిందన్నారు. జోగిని వ్యవస్థ నిర్మూలించడం,బానిసత్వం వెట్టిచాకిరి నిషేదం అంటరాని తనం నిర్మూలన అందరు సాధించాలని కోరారు.ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే కార్యక్రమాన్ని ఎటువంటి వివక్షత చూపినా వారు చట్టం ముందు శిక్షణ గురవుతారని తెలిపారు. ఎస్సీ చట్టాలపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. బీసీ హస్టల్ వార్డెన్ శిరీషా,ఆర్ఐ రామయ్య, పీసీ దేవరాజు ,వీఆర్‌వో నారాయణ,గ్రామ సేవకులు,ప్రజలు పాల్గొన్నారు.

## బిఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ గోడ పత్రికలు విడుదల



**కోసిగి, జనవరి 31, ప్రభాతవార్త :**

భారతరత్న డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించి ఆ కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరుతూ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో శనివారం కోసిగిలోని ఎస్సీ కమ్యూనిటీ భవనం నందు గోడ పత్రికలను విడుదల చేసారు..ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇంచార్జీ పులిగుంట్ల గోపి మాదిగ, మంత్రాలయం నియోజకవర్గ ఇంచార్జీ బందారి హనుమంతు, ఎంఎస్ప జిల్లా ఉపాధ్యక్షులు దుర్గప్పమాదిగల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.. కోసిగి మండల అధ్యఓఉలు చింతకుంట సామేల్‌మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 8వ తేదిన కౌతాళం మండలం హాల్వి గ్రామంలో భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు..ఈ మహా సంకల్పానికి మహానేత మందకృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున న్నట్లు తెలిపారు.. కావున మండలంలో ఉండే మాదిగ ఉపకులాలు, ఉద్యోగులు, విద్యార్థులు, మాదిగ నాయకులు అధిక సంఖ్యలో హాజరై జయ ప్రదం చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు చింతకుంట నాగరాజు, మండల అదికార ప్రతినిధి మొ ండి నరసింహులు, ప్రకాష్, ఈరన్న, చిదానంద, హనుమంతు, నరసయ్య,ఇశ్రాయేల్, సోని నరసింహులు, శంకరప్ప,నాగరాజు, తిమోతి, చంద్ర తదితరులు పాల్గొన్నారు..

## అంబటి నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది-తెదేపా

– వెల్దుర్తిలో అంబటిరాంబాబు దిష్టిబొమ్మ దగ్ధం చేసిన తెదేపా శ్రేణులు..



**వెల్దుర్తి, జనవరి 31, ప్రభాతవార్త :** వైకాపా మాజీ మం త్రి అంబటిరాంబాబు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని మండల తెదేపా అధ్యక్షులు టి.ఇ.బలరాంగౌడ్,మండల తెదేపా యువనాయకులు వెల్దుర్తి సొసైటీ అధ్యక్షులు బొమ్మన రమాకాంత్ రెడ్డి అన్నారు.అంబటిరాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అసభ్యపదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా శనివారం రాత్రి బొమ్మనశివశంకర్‌రెడ్డి తెదేపా కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి అంబటి దిష్టిబొమ్మను వారు తెదేపా నాయకులు,కార్యకర్తలతో కలిసి చెప్పులతో కొట్టారు. అనంతరం దిష్టిబొమ్మకు నిప్పు అంటించి దగ్ధం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిపై, ఆయన కుటుంబంపై మాట్లాడే యోగ్యత లేని మీరు మాట్లాడతారా అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు టి.ఇ.బలరాంగౌడ్,మండల తెదేపా యువనాయకులు వెల్దుర్తి సొసైటీ అధ్యక్షులు బొమ్మన రమాకాంత్‌రెడ్డి,రామళ్లకోట రామక్రిష్ణఆచారి, రామస్వామి, రాంబాబు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయం వద్ద నేల నుంచి ఉబికి వస్తున్న నీరు

– ఆ శివుని మహిమనే అంటున్న భక్తులు..



**వెల్దుర్తి, జనవరి 31, ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణ సమీపంలోని జర్నలిస్టుకాలనీలో వెలసిన శ్రీలక్ష్మీవెంకటేశ్వరసద్గురు సాయినాథ అయ్యప్ప స్వామి ఆలయం ఎదుట శనివారం భూమి నుంచి నీరు ఉబికి ఉబికి వస్తుంది. అటువైపుగా ఎటువంటి పైపులైన్ పోలేదని ఆలయ కమిటీ వారు తెలిపారు.అయితే ఆ శివుని మహిహనే అని భక్తులు అంటున్నారు. ఏది ఏమైనా అద్భుతం జరుగుతుందని అందరు చెబుతున్నారు.

## గ్రామీణ ప్రజలు శాంతియుతంగా ఉండాలి

– అల్లర్లకు పాల్పడితే చర్యలు చర్యలు తప్పవు – ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్




**కొత్తపల్లె, జనవరి 31, ప్రభాతవార్తః** గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు శాంతియుతంగా జీవించాలని అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు డిఎస్పీ రామాంజినాయక్ హెచ్చరించారు. ఆయన శనివారం మండలంలోని జానాల గూడెంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు సమస్యలు ఏమైనా ఉంటే కలిసికట్టుగా పరిష్కరించుకోవాలన్నారు. పదిరోజుల క్రితం జానాలగూడెంలో రెండువర్గాల మధ్య ఘర్షణ జరిగి 9 మందిపై కేసు నమోదు అయిందన్నారు. అందుకోసం ప్రతిఒక్కరు శాంతియుతంగా జీవించాలన్నారు. మరోసారి ఘర్షణలకు పాల్పడితే సహించేది లేదన్నారు. గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తే ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో ప్రతిఒక్కరు అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండాలన్నారు. ఈసమావేశంలో ఆత్మకూరు సిఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ నాగజ్యోతి, తహశీల్దార్ ఉమారాణి, మత్స్య శాఖ ఎఫ్‌డివో భరత్‌లాల్ నాయక్, ఏపీటూరిజం అధికారి విజయలక్ష్మీ, ఇరిగేషన్ డిఈ మోహన్‌రెడ్డి, వేల్పేర్ అధికారులు, లీగల్ అడ్వజర్ గిరి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుండే సేవాభావం అలవర్చుకోవాలి

– పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణి – ఎమ్మెల్సీ ఎంవి రామచంద్రారెడ్డి



**ఆళ్లగడ్డ, జనవరి 31, ప్రభాతవార్త :** విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు ఎం వి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవం సందర్భంగా శనివారం ఆళ్లగడ్డ పట్టణంలో ప్రజ్ఞా కళాశాల ప్రజ్ఞ విద్యాసంస్థల చైర్మన్ హేమలతారెడ్డి ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ మున్సిపాలిటి కార్మిక ఉద్యోగులకు దుప్పట్లు పంపిణి చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు, అపుస్మ రాష్ట్ర కమిటీ చైర్మన్ ఎం వి రామచంద్రారెడ్డి హాజరయి దుప్పట్ల పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు సేవలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గ అధ్యక్షులు టీ అమీర్ బాషా, కోశాధికారి వై యస్ చంద్రశేఖర్, ప్రజ్ఞ నర్సింహారెడ్డి, ప్రజ్ఞ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, హెచ్ఎం బాష, ఉపాధ్యా బృందం, విద్యార్థిని విద్యార్థులు, ఆళ్లగడ్డ మున్సిపాలిటి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా వారోత్సవాలు




**కర్నూలు మున్సిపల్, జనవరి 31, ప్రభాతవార్తః** రోడ్డు నియమ నిబంధనలు తప్పక పాటించాలని ప్రాంతీయ రవాణాధికారి ఎల్ భరత్ చవాన్ పేర్కొన్నారు. శుక్రవారం పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల నందు ఇంజనీరింగ్ విద్యార్థులకు సిబ్బందికి రోడ్డు భద్రత గురించి వివరిస్తు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గుడ్ సమారిటన్ రాహ్ వీర్ పథకం ద్వారా ఏదైనా అక్సిడెంట్ జరిగినప్పుడు మొదటి గంటలోగ గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లితే రూ.25 వేలు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం అందిస్తుందని వ్యక్తిగతంగా ఎటువంటి ఇబ్బందిలేకుండా చేయడం జరుగుతుందన్నారు. ఇయర్‌ఫోన్ మరియు బ్లూటూత్ వాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని హెల్మెంట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. ఈసందర బ్ంగా జడ్జి బి లీలా వెంకటశేషా ద్రి ఐఐఐటిడిఎం ఇంజనీరింగ్ కళాశాల నందు ఇంజనీరింగ్ విద్యార్థులకు సిబ్బందికి రోడ్డు భద్రతగురించి వివరిస్తు ఆజాగ్రత్త వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని అందులో శిక్షపడే అవకాశం కూడ ఉందన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయడం జరిగింది. మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్లు ఆర్‌వి మధుసూధన్, కె రవీంద్రకుమార్, ఎస్ నాగరాజ నాయక్, ఎంవి సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి బాబు కిశోర్, ఎన్ గణేష్‌బాబులు పాల్గొన్నారు.

## బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రభంజనం



**నందికొట్కూరు,జనవరి 31,ప్రభాతవార్త:** ఇటీవల రాయలసీమ యూనివర్సిటీ విడుదల చేసిన 3వ 5వ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనపరిచి అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించారని కళాశాల చైర్మన్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మూడవ సెమిస్టర్‌లో బిఎస్సీ(ఆక్వాకల్చర్)లో ఎస్.శ్వేత (9.3), బిఎస్సీ మైక్రోబయాలజీలో ఈ.జి.మనీషా),(9.3), బిఎస్సీ బాటనీ కె.జుబేదాబీ (9.3), బిఎస్సీజువాలజీ డి.తస్లీమా (8.9), బిఎస్సీకంప్యూటర్ సైన్స్ వి.ధరణీ(8.9)బికాం సిఏఈ.చిన్న(8.8) సాధించి టౌన్ టాపర్‌గా నిలిచారని, అలాగే 5వ సెమిస్టర్‌లో తమ కళాశాల విద్యార్థులు మంచి మార్కులతో టాపర్లుగా నిలిచారని ఆయన తెలిపారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ వి.ఎస్.సత్యానారాయణ, డైరెక్టర్లు రమేష్‌రెడ్డి, సరళాదేవి, ప్రిన్సిపాల్ జి.ఎం.మన్సూరఅహ మ్మద్ అధ్యాపకులు అభినంధించారు.

## ఆలూరు ఏఎస్పై చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలి



**పత్తికొండ, జనవరి 31, ప్రభాతవార్త :** ఈ 30న ప్రజా సమస్యల కోసం సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూపేష్ ఆలూరు పోలీసు స్టేషన్‌కు వెళ్ళగా విధుల్లో ఉన్న ఏఎస్సై చంద్రశేఖర్ భూపేష్ పరుస పదజాలంతో దురుసుగా ప్రవర్తించి ఇష్టానుసారంగా ధూషించాడని తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక చదువుల రామయ్య భవన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు తక్షణమే జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పంధించి ఏఎస్సైపై విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పాలకులు, పోలీసు ఉన్నతాధికారులు ప్రజలతో స్నేహాపూర్వకంగా ఉండాలని చెబుతున్న కొంత మంది అధికారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు భీమలింగప్ప, నబీరసూల్, మద్దిలేటిశెట్టి, రాజాసాహెబ్, వివిధ మండలాలకు చెందిన నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పెద్దహోతూరు రెవెన్యూ అధికారి పదవి విరమణ



**ఆలూరు, జనవరి 31, ప్రభాతవార్త :** ఆలూరు మండల రెవెన్యూ కార్యాలయంలో పెద్దహోతూరు గ్రామ రెవిన్యూ అధికారిగ విధులు నిర్వహిస్తున్న చిదానందగౌడ్ శనివారం పటవి విరమణ చేశారు. తహసిల్దార్, డిప్యూటి తహసిల్దార్. ఆర్.ఐ. ఆఫీసు అధికారులు విఆర్ఏలు, ఎక్స్ఆర్మీ అధికారులు, హొత్తిబెళగల్. రైతులు, వీరశైవ కుల పెద్దలు చిదానందగౌడ్‌ను దుశ్శాలువలు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కర్యాలయం నుండి ఆయన ఇంటి వరకు ర్యాలీగా నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వీరశైవ లింగాయత్‌లను కేంద్ర ఓబిసీ లో చేర్చాలి



**ఆలూరు, జనవరి 31, ప్రభాతవార్త :** వీరశైవ లింగాయత్‌లను ఓబిసి జాబితాలో చేర్చాలని ఆలూరు నియోజవక్గం టిడిపి ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతికి వీరశైవ లింగాయత్ నాయకులు వినతి పత్రం అందజేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతు లింగాయత్ లింగ బలిజలను ఓబీసీలో చేర్చక పోవడంతో విద్యా, ఉపాధి అవకాశాల్లో తీవ్రంగా నష్టపోతు నా న్నరని, వీరశైవ లింగాయత్‌లు వెనుకబడిన అతి పేదరికంలో ఉన్నారని వారు తెలిపారు. గత ఎన్నికల సంధర్భంగా వీరశైవ లింగాయత్, లింగ బలిజ ను బీసీ డిక్లరేషన్‌లో ఓబీసీలో చేర్చుతామని ఇచ్చి హామీ మేరకు వెంటనే ఓబీసీలో చేర్చుటకు రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుటకకు కృషి చేయాలని వారు కోరారు. వీరశైవ లింగాయతి సభ్యులు కుమార్‌గౌడ్, బీమ్మన గౌడ్, ఉమాకాంత్‌స్వామి, బసవన్నగౌడ్, జనార్ధన్‌స్వామి, బోగేష్‌స్వామి, నాగరాజు, గజేంద్రగౌడ్, ఆలూరు పరమేష్, నవీన్, బద్రి, భీమా, నీత్రవటీ శేఖర్, పాల్గొన్నారు.

## ఎంపీపీ పై నెగ్గిన అవిశ్వాస తీర్మానం..టిడిపి కైవసం

– ఆర్డీఓ సమక్షంలో తీర్మానం



**జూపాడుబంగ్లా, జనవరి 31, ప్రభాతవార్త :** జూపాడుబంగ్లా మండల ఎంపీపీ పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శనివారం జూపాడుబంగ్లా మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఆర్డీవో నాగజ్యోతి, ఎంపిడిఓ గోపికృష్ణ, తహసిల్దార్ చంద్రశేఖర్‌నాయక్ సమక్షంలో వైసిపి ఎంపీపీ సువర్ణమ్మ పై అవిశ్వాస తీర్మానం సమావేశం జరిగింది. ఇటీవల సువర్ణమ్మ పై అవిశ్వాసం ప్రకటిస్తూ ఆరు మంది ఎంపీటీసి సభ్యులు ఆర్డీఓ కు వినతి అందజేశారు. ఈ మేరకు శనివారం ఆర్డీఓ సమక్షంలో ఎంపిపి పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంపీటీసి సభ్యులు గుండ్రెడ్డి సుజాతమ్మ, మోతే వెంకటమ్మ, కృపాకర్, తెలుగు వెంకటరమణమ్మ, దొడ్డ నాగమణి, మిద్దె నీలమ్మలు హాజరయ్యారు. 9 మంది ఎంపీటీసి సభ్యులకు గాను ఏడుగురు ఎంపీటీసి సభ్యులు హాజరయ్యారు. సువర్ణమ్మ పై పెట్టిన అవిశ్వాస తీర్మానం గురించి అధికారులు సభ్యులకు వివరించారు. అందులో ఎంపిపి పదవి నుంచి ససువర్ణము ను తొలగించాలని ఏడుగురు ఎంపీటిసీ సభ్యులు తీర్మానం చేసూ చేతులు పైకి ఎత్తారు. మెజార్టీ సభ్యుల తీర్మానం మేరకు ఎంపీపీగా కొనసాగిన సువర్ణమ్మను పదవి నుంచి తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో జరిగిన తీర్మానం అంశాలను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. నూతన ఎంపిపి ఎన్నిక కోసం మరో తేదీని ఉన్నతాధికారులు ఖరారు చేస్తారని ఆమె వెల్లడించారు. ఆవిశ్వాస తీర్మానం సంధర్భంగా రూరల్ సి.ఐ.టి.సుబ్రమణ్యం పర్యవేక్షణలో ఎస్సై మల్లికార్జున కార్యాలయం వద్ద గట్టి భంధోబస్తు ఏర్పాటు చేశారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణి

– మాజీ ఎంపీటిసి జంగిటి రాజు

**రుద్రవరం, జనవరి 31, ప్రభాతవార్తః** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం ఒకరోజు ముందుగానే పంపిణి చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా నాయకుడు మాజీ ఎంపీటిసి జంగిటి రాజు. ఈసందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కోటకొండ గ్రామంలో ఇంటింటికి పంపిణి చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణి కార్యక్రమంలో పాల్గొని పెన్షన్ పంపిణి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒక్కరోజు ముందుగానే పెన్షన్ పంపిణి అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి గ్రామ నాయకులకు అధికారులకు ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తెదేపా నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# శ్రీ రామలింగేశ్వర స్వామి ప్రతిష్ట ఉత్సవాలు..

**– దుద్దిలో శ్రీ రాముడు స్వయంగా ప్రతిష్టించిన శివలింగానికి మహాభిషేకం..**





**దుద్ది (కోసిగి), జనవరి 31, ప్రభాతవార్త :** మండల పరిధిలోని దుద్ది, కోల్మాన్‌పేట గ్రామాల పొలిమేరల్లో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఫిబ్రవరి 1వ తేది ఆదివారం శ్రీ రాజరాజేశ్వరీ దేవి ఉత్సవాలతో పాటు శ్రీరామచంద్రుడు స్వయంగా ప్రతిష్టించిన శివలింగానికి మహాభిషేకం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త గుడిసె రామలింగప్ప, స్వామివారి భక్తులు శనివారం విలేకర్లకు తెలిపారు. త్రేతాయుగంలో శ్రీ రాముడు అరణ్యవాసం అనంతరం తిరుగు ప్రయాణంలో శివపూజ కోసం తుంగభద్ర నదీతీర ప్రాంతంలో స్వయంగా శివలింగాన్ని ప్రతిష్టించి దానికి ప్రత్యేక పూజలు చేసినట్లు పూర్వీకులు తెలిపారన్నారు.. ముఖ్యంగా కౌతాళం మండలంలోని మెళగనూరులో, కోసిగి మండలంలో కందుకూరు, దుద్ది గ్రామ పరిధిలలో, మంత్రాలయం మండలంలోని రాంపురం, నందవరం మండలంలోని గురుజాల గ్రామాలలో శ్రీరామ చంద్రమూర్తి స్వయంగా ఈ శివలింగాలను ప్రతిష్టించాడని తెలిపారు..కాగా ఈ పుణ్యక్షేత్రాలలో వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాలను పునరుద్ధరించి వాటికి ప్రాణ ప్రతిష్టత చేయడం జరిగిందని, ఇందులో భాగంగానే దుద్ది పొలమేరల్లో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. ఈ ఆలయంలో రామలింగేశ్వర స్వామితో పాటు శ్రీ రాజరాజేశ్వరీ దేవి విగ్రహాన్ని కూడా గత 9 సంవత్సరాల క్రితం మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల చేతుల మీదుగా ప్రతిష్టించడం జరిగిందన్నారు..ఆదివారం జరిగే పూజలను ఆయా స్వామిల ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వరీ దేవి, గణపతి, నవగ్రహాలతో పాటు ధ్వజ స్థంభంకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంతేకాక ఆలయంలో పూజలు చేసి హోమ యజ్ఞం చేపట్టడంతో పాటు గర్భగుడిలో శ్రీ రాజరాజేశ్వరీ దేవి విగ్రహాన్ని, ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలను, గుడి ఎదుట ధ్వజ స్థంభంను ప్రతిష్టించారని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నేడు తొమ్మిదవ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా ఉదయం 5 గంటలకు శ్రీ గంగాపూజ, స్వస్తి పుణ్యాహవాచనం, గణేశ్ పూజలను నిర్వహించి, మధ్యాహ్నం అమ్మవారికి, స్వామి వారికి అభిషేక పూజలు, నవగ్రహ శాంతి, శాంతి హోమం, మహా మంగళ హారతి, గణారాధన కార్యాక్రమాలు నిర్వహించి వచ్చిన భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. కావున సద్భక్తులందరూ ఈ పూజాలలో పాల్గొని అమ్మవారి, స్వామి వారి కృపకు పాత్రులు కావలెనని కోరారు.

## చేపల పెంపకం వేలం పాట వాయిదా..

**– వేలానికి హాజరు కానీ పాటాదారులు..**

**కోసిగి, జనవరి 31, ప్రభాతవార్త :** కోసిగి గ్రామ సమీపంలో ఉన్న పులికనుమ చెరువులో చేపలను పెంచి వాటిని విక్రయించేందుకు గానూ ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా నిర్వహిస్తున్న చేపల వేలం పాట వాయిదా వేసినట్లు మత్స్యశాఖ సహాయ సంచాలకులు నాగరాజు శనివారం తెలిపారు.. ఇటీవల ఇచ్చిన వేలం పాటకు సంబంధించి 31వ తేది శనివారం బహిరంగ వేలం పాటను నిర్వహించేందుకు అధికారికంగా నోటీసులు జారీ చేయడం జరిగింది.. అనుకున్న సమయానికి మత్స్యశాఖ అధికారులు వచ్చారే కానీ వేలంలో పాల్గొనే పోటీదారులు ఈ వేలం పాటకు హాజరు కాలేకపోయారు..కనీసం ధరవత్తు చెల్లించేందుకు కూడా ఎవరు ముందుకు రాలేదు సరి కదా..కనీసం ఈవేలం పాట జరిగి ప్రాంతానికి ఒక్కరు కూడా రాకపోవడం విశేషం.. దీంతో వేసిన కుర్చీలన్నీ ఖాళీగానే దర్శనమిచ్చాయి.. వేలం పాట కోసం ఉదయం 10 గంటల నుండి ఎదురు చూసిన అధికారులు 12 గంటల దాకా ఎవరు రాకపోవడంతో ఈ చేపల పెంపకం వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు మత్స్యశాఖ అధికారి నాగరాజు ప్రకటించారు.. తిరిగి ఈ వేలం పాటను ఎప్పుడు వేయాలో జిల్లా మత్స్యశాఖ అధికారుల సూచనల మేరకు అప్పుడు ప్రకటిస్తామని తెలిపారు..

## రాష్ట్ర ఏపిపిఎస్సి గ్రూప్1కు నంద్యాల నివాసి మౌనిక

**నంద్యాల, జనవరి 31, ప్రభాతవార్తప్రతినిధి :**



అంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఏపిపిఎస్సి గ్రూప్1కు నంద్యాల నివాసి యన్‌జో కాలనికి చెందిన మౌనిక ఎంపిక కావడము చాలా గర్వించదగ్గ విషయమని ఐయంఏ రాష్ట్ర అద్యక్షులు డాక్టరు రవికృష్ణ అన్నారు. మౌలిరన దివంగత డాక్టరు తిప్పారెడ్డి మనుమరాలని అమె తల్లిదండ్రులు లక్ష్మిమోహన్‌రెడ్డి సౌజన్యకుమారిని అయన చెప్పారు. ఈమె యంపిడిఓడా ఎంపిఅయినందుకు ఐయంఏ తరుపున కృతజ్ఞతలు చెప్పారు.

## ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ ఓపన్ రాపిడ్ చేస్ పోటీలు

**నంద్యాల, జనవరి 31, ప్రభాతవార్తప్రతినిధి :** నంద్యాల పట్టణలంలోని రామకృష్ణ డిగ్రీ కాలేజిలో పిబ్రవరి 21,22 తేదిలో ఇంటర్నేషనల్ ఫిడే రెటింగ్ ఓపన్ రాపిడ్ చేస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చేస్ సంఘం అద్యక్షులు డాక్టరు రవికృష్ణ చెప్పారు. శనివారము ఈ పోటీలకు సంబందించిన బ్రోత్‌ను రాష్ట్ర న్యాయ ముస్లీం మైనార్టి శాఖ మంత్రి అవిస్కరించారు. చేస్ సంఘం అద్యక్షులు డాక్టరు రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డిలఅద్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ చదరంగరము క్రీడ పట్ల బాలలల్లో ఇటీవల అసక్తి పెరిగిందన్నారు. నంద్యాలలో మొట్టమోదటి సారిగా అంతర్జాతీయ ఫిడే రెటింగ్ ఓపన్ రాపిడ్ చేస్ టోర్నమెంటు నిర్వహించడము అబినందనీయ మన్నారు. డాక్టరు రవికృష్ణ మాట్లాడుతూ పోటీలు విజేతలకు మొదటి బహుమతి 30000, రెండవ బహుమతి రూ 20000తృతీయ బహుమతి రూ 15000కలిపి మొత్తం మూడు లక్షలు నగదు బహుమతులలతో పాటు వివిద విబాగాల్లో విజేతలకు ట్రోపిలను పతాకాలను అంద జేయడము జరుగుతుందని చెప్పారు.పిబ్రవరి 15లోపల క్రీడాకారులు పేర్లు నమొఒదు చేసుకోవాలని చెప్పారు.

## బి.సి.ఆర్.పి.ఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా దాసరి చంద్రశేఖర్ యాదవ్ నియామకం




**కర్నూలు హాస్పిటల్, జనవరి 31, ప్రభాతవార్త :** బి.సి. రిజర్వేషన్ల పోరాట సమితి (బి.సి.ఆర్.పి.ఎస్) కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా దాసరి చంద్రశేఖర్ యాదవ్ ను నియమించినట్లు సమితి జాతీయ అధ్యక్షులు కె.పీ. అభిరామ్ జాతీయ కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఈ రోజు కర్నూలులోని బి క్యాంప్ – బి.వి. భవనంలో బి.సి.ఆర్.పి.ఎస సమావేశం నిర్వహించబడింది. నూతన జిల్లా అధ్యక్షుడి నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బి.సి. రిజర్వేషన్ల పోరాట సమితి మహిళా అధ్యక్షురాలు చంద్రకళాబాయి, వి.వి. చంద్రికమ్మ, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డీ బండ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల ఎల్లశివుడు, సోమన్న పాల్గొన్నారు.

## గ్రామ కమిటీలతో ప్రజలకు మరింత చేరువ



**మంత్రాలయం, జనవరి 31, ప్రభాతవార్త;**
వైఎస్సార్సీపీ పార్టీ గ్రామ కమిటీల నియా మకంతో ప్రజలకు మరింత చేరువ అవుతామని వైసీపీ మండల అధ్యక్షులు భీంరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో గ్రామ కమిటీల నియామక పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ కమిటీల నియామకం పూర్తి అయినట్లు తెలిపారు. ప్రతి నాయకుడు, కార్య కర్తకు ప్రత్యేక గుర్తింపుకార్డును అందజేస్తామన్నారు. కావునా పార్టీలో అందరూ కలిసికట్టుగా ఉండాల న్నారు. వైసీపీ నాయకులు రోగప్ప, బొజ్జప్ప, మేకల నారాయణ, ఇంకోబ, భీమ పాల్గొన్నారు.

## కేఈ సైన్యం ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు



**మద్దికెర, జనవరి 31, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన మద్దికెరలోని మద్దమాంబ రథోత్సవాన్ని పురస్కరించుకుని కేఈ సైన్యం ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలో పాల్గొనే వారు కమిటీని సంప్రదించాలన్నారు.

## ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



**హాలహర్వి, జనవరి 31, ప్రభాతవార్త;** బాపురంలో కొలువై ఉన్న శ్రీ బసవేశ్వర స్వామి రథోత్సవ ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవా లని హాలహర్వి ఎస్ఐ ఈశ్వరరావు అన్నారు. శనివారం ఆయన బాపురం గ్రామం లో పర్యటించి రథోత్సవ ఉత్సవాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రథోత్సవ ఉత్సవాల్లో ప్రజలుకుల మతాలకు అతీతంగా అందరూ కలిసి ఐక్యంగా జరుపుకోవాలని సూచించారు. ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని బాపురం గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉత్సవాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## శ్రీ కౌలుట్ల చెన్నకేశవస్వామి కళ్యాణోత్సవం



**దేవనకొండ, జనవరి 31, ప్రభాతవార్త;** మండల పరిధి లోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో వెలిసిన శ్రీ కౌలుట్ల చెన్నకేశవస్వామి కళ్యాణోత్సవం శనివారం కమనీయంగా సాగింది. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడులచే శనివారం వైభవంగా నిర్వహించినట్లు దేవదాయశాఖ ఈఓ వీరయ్య తెలిపారు. ఉదయానే స్వామివారికి వేద పండితులు ఆకు పూజలు, కుంకుమార్చన, మహా మంగళహారతితో పాటు తదితర పూజలు చేశారు. స్వామివారి కళ్యాణ మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ మాట్లాడుతూ స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. స్వామివారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు



**దేవనకొండ, జనవరి 31, ప్రభాతవార్త;** పింఛన్ లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్‌లను అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని నేలతలమరి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఆయన చేతులమీదుగా పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్క లబ్ధిదారుడికి పింఛన్‌ను అందిస్తామన్నారు. సచివాలయ సిబ్బంది, తాము ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు. పింఛన్‌దారులకు ఏవైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తులసిమోహిని, వెల్ఫేర్ అసిస్టెంట్ సుల్తాన్, వీఆర్వో జాకీర్ పాల్గొన్నారు.

## నేడు బసవేశ్వరస్వామి రథోత్సవం

**హాలహర్వి, జనవరి 31, ప్రభాతవార్త;**



మండలంలోని బాపురం గ్రామంలో ఆదివారం శ్రీ బసవేశ్వరస్వామి రథోత్సవ ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. రథోత్సవ ఉత్సవాల సందర్భంగా స్వామివారికి ఆకుపూజలు, పంచామృతాభిషేకం, గణపతి పూజ తదితర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం నందికోలు, కోలాట, మంగళ హారతులు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి ఖడ్గం ప్రదర్శన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వాములవారి ఉత్సవమూర్తులను పల్లకి ఊరేగించి రథంపై ప్రతిష్టిస్తారు. ఆలయ పూజారులు వీరయ్యస్వామి, శంభులింగస్వామి రథానికి పూజలు చేస్తారు. ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## శ్రీవారి భక్తులకు ముఖ్యమంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలి : మాజీ ఎమ్మెల్యే

**క్రిష్ణగిరి, జనవరి 31, ప్రభాతవార్త :**



కలియుగ దైవం అయినటువంటి శ్రీవెంకటేశ్వరస్వామి భక్తులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి డిమాండ్ చేశారు.శనివారం మండల పరిదిలోని కర్లకుంట గ్రామంలో ఉత్తరముఖంగా వెలిసిన శ్రీవెంకటేశ్వస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. రాష్ట్ర వైసీపీ పార్టి ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని దేవాలయంలో వైసీపీ నాయకులు పూజలు చేశారు.తిరుమల లడ్డు కల్తీ జరిగిందని ఈ కూటమి ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోపణలు చేశారన్నారు.దీనిపై దే శంలోని అత్యున్నతమైన సి.బి.ఐ కోర్టుక్లీన్‌చీట్‌ఇచ్చిందన్నారు. లడ్డులో జంతువుల కొవ్వు కలపలేదని ల్యాబ్ రిపోర్టులో వచ్చిందని దీనిని సి.బి.ఐ కూడ చార్జిషీట్‌లో పొందుపరిచడం జరిగింది.అయినా ప్రభుత్వంనకు అనుకూలమైన మీడియాలో,సోషల్ మీడియాలో టి.డి.పి నాయకులునానాయాగి చేస్తున్నారు.దేశంలో అత్యున్నతమైన కోర్టులు కల్తీ జరుగ లేదని రిపోర్టు ఇస్తే దీనిపై కూటమినాయ కులు నోరు మెదపటం లేదు.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు.ఆయన రాజకీయాలకు కలియుగదైవం శ్రీవెంకటేశ్వస్వామిని వాడుకోవడం దారుణం అన్నారు.ఇప్పటికైన ఆయనకు మంచి బుద్దిని ప్రసాదించమని భగవంతుడిని కోరామన్నారు.ఈ కార్యక్రమంలో క్రిష్ణగిరి మండల యం.పి.పి కంగాటి వెంకటరామిరెడ్డి,యూత్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి,కర్లకుంట మధురెడ్డి,నాగేశ్వరరెడ్డి,రామకృష్ణాపురం సుభాశు,అమకతాడు బాలు,చుంచు ఎర్రగుడి భీమిరెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



**ఆదోనిలీగల్, జనవరి 31, ప్రభాతవార్త;**
ఫిబ్రవరి 12న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, సీఐటీయూ పట్టణ కార్యదర్శి తిప్పన్న, నాయకులు కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక సీడీపీఓ ప్రాజెక్టు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ చౌదరికి అంగన్‌వాడీల సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 12న కేంద్ర కార్మిక సంఘాల లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీ వర్కర్లందరూ పాల్గొనాలని కోరారు. గతంలో ఉన్న 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమ్మెలో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.

## బొందిమడుగుల రమేష్ మాదిగపై దాడి అమానుషం

**– హత్యా నిందితులను కఠినంగా శిక్షించాలి – ఎమ్మార్పీఎస్ నాయకులు**



**హొళగుంద, జనవరి 31, ప్రభాతవార్త;** బొంది మడుగుల గ్రామ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో దాడికి గురై కోలుకోలేక మృతిచెందిన ఎమ్మార్పీఎస్ బొందిమడుగుల టీఎం రమేష్ మాదిగ మృతి అమానుషమని, వెంటనే హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మార్పీఎస్ దండోరా, దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలకేంద్రమైన హొళగుందలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు పంపించాలంటూ మెమోరాండం సమర్పించారు. సీనియర్ దళిత నాయకుడు చిదానంద, ఎమ్మార్పీఎస్ దండోరా ఆదోని డివిజన్ అధ్యక్షుడు పంచగుండగ వెంకటేష్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు సూగూరు కెంచప్ప, అంబేద్కర్‌వాది దళిత నాయకుడు కన్నారావు, బహుజన టైమ్స్ ఎండీ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టీఎం రమేష్ మాదిగై దాడి, హత్యను తీవ్రంగా ఖండించారు. అగ్రవర్ణాల కుల దురహంకారానికి ఈ ఘటన సాక్ష్యమని, దళితుల పక్షంగా పోరాడే నాయకులు, దళితుల హక్కుల కోసం, దళితుల ఆస్తుల రక్షణ కోసం మాట్లాడే నేతలను లక్ష్యంగా దళితేతరులు దాడులు ఏస్తున్నారని, ప్రాణాలు తీస్తున్నారని ధ్వజమెత్తారు. జిల్లాలో దళితుల గొంతుకగా అణగారిన వర్గాల హక్కుల గురించి మాట్లాడే నేతగా ముందు వరుసలో ఉండే బొందిమడుగుల టీఎం రమేష్ మాదిగ హత్య దళిత సమాజంపై, అగ్రవర్ణాల గొడ్డలిపోటు అని పేర్కొన్నారు. వెంటనే హత్య చేసిన నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా నాయకులు ఎం.మహాదేవుడు, ఎమ్మార్పీఎస్ హొళగుంద మండల కన్వీనర్ కోగిలతోట వీరేష్, కోగిలతోట గోవర్ధన్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చిన్నహ్యాట ప్రకాష్, ఎమ్మార్పీఎస్ నాయకులు ముద్దటమాగి నాగేంద్ర, జనసేన వీరేష్, సినిమా మంగన్న, భాస్కర్, ఎర్రిస్వామి, లోకేష్, ఆదోని డివిజన్ ప్రధాన కార్యదర్శి వై.రంగప్ప, కె.హనుమంతు, వరాల మల్లయ్య, హెచ్.మల్లయ్య, తప్పెట మల్లికార్జున, శివప్ప, కోగిలతోట బసవరాజ్, హొళగుంద గ్రామ అధ్యక్షుడు మృత్యుంజయ, శివ, సిద్ధ, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఒక రోజు ముందుగానే పింఛన్‌ల పండగ...



**హొళగుంద, జనవరి 31, ప్రభాతవార్త;**
రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పింఛన్లను లబ్ధిదారులకు అందించడంతో పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, కో కన్వీనర్ జాకీర్, టీడీపీ మండల మైనార్టీ అధ్యక్షుడు ముల్లా మోయిన్, సీనియర్ నాయకుడు దుర్గయ్య పేర్కొన్నారు. శనివారం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్ మార్గదర్శకంలో మండలకేంద్రమైన హొళగుందలోని 38, 39, 40 బూత్ కన్వీనర్ల ఆధ్వర్యంలో ఈబీసీ కాలనీ, శ్రీ సిద్దేశ్వర ఆలయం, సినిమా రోడ్డు కాలనీ ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్లను నేరుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీన ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి పింఛన్‌దారులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు వీరన్నగౌడ్, టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ఆదం, టీడీపీ సీనియర్ నాయకుడు డీఎస్ బాషా, నాయకులు లాబ్‌గిరి, రాము, నూర్, రామంజి, బూత్ కన్వీనర్లు షావలి, అమాన్, బషీర్, వలి, 38, 39, 40 బూత్ కన్వీనర్ షావలి, అమాన్‌ఖ, బషీర్, వలి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

**– పెద్దహ్యాటలో పింఛన్ల పంపిణీ...**



– మండలంలోని పెద్దహ్యాట గ్రామంలో టీడీపీ కార్యకర్తలు కార్యకర్తలు రచయ్యస్వామి, బి.కె.వీరేష్, రాము, వీరభద్రప్పల ఆధ్వర్యంలో పింఛన్‌దారులకు ఇంటింటికి తిరిగి పింఛన్‌లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. పింఛన్‌దారులకు ప్రతినెలా సక్రమంగా పింఛన్‌లను అందిస్తోందన్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని, వాటిని టీడీపీ ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## లడ్డు ప్రసాదంపై రాజకీయం చేసిన కూటమి ప్రభుత్వం

**– నిజం బట్టబయలు కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన వైసీపీ**



**కోడుమూరు,జనవరి 31, ప్రభాతవార్త :** లడ్డు ప్రసాదంపై కూటమి ప్రభుత్వ కుట్ర రాజకీయాలకు పాల్పడిందని కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జ్ ఆదిమూలపు సతీష్ ఆరోపించారు. శనివారం స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం సన్నిధిలో వైసీపీ పార్టీ శ్రేణులంతా కూటమి నేతలు దేవ దేవుని ప్రసాదాలపై రాజకీయం చేసి అబాసు పాలైన వారిని కలియుగ దేవుడే తగిన గుణపాఠం చెబుతారని కోరుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. అంతే గాక పచ్చమూకలు దేవుడి లడ్డుపై చేసిన తప్పుడు ఆరోపణలపై సిట్ ధర్యాప్తులో వాస్తవాలు వెల్లడించడంలో శ్రేణులు ఆలయ సన్నిధిలో టెంకాయలు కొట్టి కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆదిమూలపు సతీష్ మాట్లాడారు. ఎన్నికల వాగ్దానాలను అమలు చేయలేక, పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం తిరుమల లడ్డు ప్రసాదంపై తప్పుడు ఆరోపణలు చేసిందన్నారు. లడ్డు తయారీలో ఉపయోగించే నెయ్యిలో ఎలాంటి కల్తీ జరుగలేదని సిట్ ధర్యాప్తు ద్వారా సుప్రీం కోర్టుకు నివేదికను అందజేసిందన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై కూటమి ప్రభుత్వం చేసిన విషప్రచారాలపై ఆయన తీవ్రంగా ఖండించారు. కోట్లాది మంది వెంకన్న స్వామి భక్తుల మనో బావాలను దెబ్బతీసేలా జరిగిన ఈ దుష్ప్రచారాలు పూర్తిగా అపద్ధమని తేలిందన్నారు. రాజకీయ లబ్దికోసం దేవ దేవాలయాలను,దేవుళ్లను వాడుకోవడం దురదృష్టకరమన్నారు. తిరుమల తిరుమపి దేవస్థానం లడ్డూ ప్రసాదంపై సిట్ ద్వారా వాస్తవాలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో స్వామి వారిపై జరిగిన అపవాదు తొలగినందుకు కృతజ్ఞతగా నేడు కోడుమూరులోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించామన్నారు. కోడుమూరు జడ్పీటీసీ సభ్యులు బరుసు రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మం పరిరక్షించుకుంటామంటూ గొప్పలు చెప్పిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవణ్ కళ్యాణ్ దుర్గమ్మ గుడికి,మెట్లు కడిగారని, అయితే నేడు కూటమి నేతలు లడ్డు ప్రసాదంపై చేసిన తప్పుడు ప్రచారాలు సిట్ ద్వారా బట్టబయలయ్యాయన్నారు. కలియుగ దేవ దేవుడైన శ్రీ వెంకన్న లడ్డూపై జరిగిన అపవిత్రపై పవణ్ కళ్యాణ్ ఏమి సమాధానం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు వైసీపీ మండల కన్వీనర్ బి.రమేష్ నాయుడు,జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి క్రిష్ణారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి లాయర్ ప్రభాకర్,స్థానిక వైసీపీ నాయకులు గుజరాతి ప్రవీణ్ కుమార్, రవికుమార్‌రెడ్డి, శివరాముడు, మాదులు, లింగమయ్య, రాఘవేంద్ర, జగదీష్, రవిశంకర్, తేనేశ్వరరెడ్డి, విష్ణుదాస్, కరెంట్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కిరాతకులను ఎన్‌కౌంటర్ చేయాలి



**మద్దికెర, జనవరి 31, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన మద్దికెరలో శనివారం దళిత సంఘం నాయకులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ గుండాల నాయక్ మ ఉందు టీఎం రమేష్‌పై దాడి అమానుషమని, తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రమేష్‌పై దాడి చేసిన వారిని ఎన్‌కౌంటర్ చేయాలని నిరసన తెలిపి, వినతి పత్రం అందించారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈ ఘటనపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. నిందితులను గుర్తించి, వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు, నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద తక్షణమే కేసులు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలోని మాదిగ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, బాధితా కుటుంబానికి మాదిగ ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బండారు ఆంజనేయులు, గంధం చంద్ర, ఎడవలి ప్రభుదాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బందెల ఆనంద్‌కుమార్, ఎంపీటీసీ గద్దల అంజి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బసినేపల్లి ప్రతాప్, ఎడవలి దానవేంద్ర, మాజీ ండలాధ్యక్షుడు భాస్కర్, బసినేపల్లి సుందరయ్య, వినోద్ ఉన్నారు.

# రోడ్డు ప్రమాద నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో మంత్రి
- డ్రైవర్లు ప్రమాదం జరగకముందే అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, జనవరి 31, ప్రభాతవార్తః ప్రతినిధి :** వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. వాహనాల్లో అధిక లోడింగ్ చేయడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతుందని దీనిపై డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని విజయపాల డైరీ సమీపంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో నిర్వహించిన 37వజాతీయ రోడ్డుభద్రతా మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర రాజకుమారితో కలసి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో డిటివో శివారెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఈ శ్రీదర్‌రెడ్డి, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్‌లిమిటెడ్ ప్రాజెక్టు హెడ్ మదన్‌మోహన్, చాపిరేవుల టోల్‌ప్లాజా అధికారులు, లారీ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాహనాల సంఖ్యపెరగడం వల్ల రోడ్లుపై ట్రాఫిక్‌సమస్య తీవ్రమైందని అందువల్ల ప్రతిఒక్కరు నియమ నిబంధనలు పాటిస్తు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని మత్తు పదార్థాలు సేవించి డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేశారు. నూనెపల్లె బ్రిడ్జి వద్ద ట్రాఫిక సమస్య ఎక్కువగా ఉంటుందని అక్కడ బస్సుల నిలుపుదల కోసం ప్రత్యేక సర్వీసు రోడ్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదం జరిగిన తరువాత బాధపడడం కన్నా ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా అప్రమత్తంగా ఉండి జాగ్రత్తగా వాహనాలు నడపాలని డ్రైవర్లకు సూచించారు. ప్రాణం ఎంతో విలువైందని రోడ్డు ప్రమాదాల కారణంగా ఏవరు ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

# చదరంగం క్రీడ పట్ల బాలలలో ఆసక్తి పెరిగింది : మంత్రి ఫరూక్



**నంద్యాల, జనవరి 31, ప్రభాతవార్త ప్రతినిధిః** చదరంగం క్రీడ పట్ల బాలలల్లో ఆసక్తి పెరిగిందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శనివారం ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో ఫిబ్రవరి 21, 22 తేదిల్లో ఎస్‌బిఐ కాలనీలోని శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ఫీడే రేటింగ్ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ పోటీ వివరాలతో కూడిన పోస్టర్స్‌ను మంత్రి ఎన్ఎండి ఫరూక్ నంద్యాల క్యాంపు కార్యాలయంలో అవిష్కరించారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాలలో మొట్టమొదటి సారిగా అంతర్జాతీయ ఫీడే రేటింగ్ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం చదరంగం క్రీడా అభివృద్ధి కోసం చేస్తున్న కృషి ప్రశంసనీయం అన్నారు. జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డా.రవికృష్ణ మాట్లాడుతూ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలు మొత్తం 3 లక్షల రూపాయల నగదుతో పాటు వివిధ విభాగాల విజేతలకు ట్రోఫీలను, పతకాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈపోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఫిబ్రవరి 15 లోపు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఏపీచెస్.ఓఆర్‌జిలో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈటోర్నమెంటులో పాల్గొన దలచిన క్రీడాకారులు అల్ ఇండియా చెస్ సభ్యత్వం కలిగిఉండాలని, సభ్యత్వం ఉన్న వారు 2025-26 సంవత్సరానికి రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

# ప్రమాదంలో.. వ్యక్తి మృతి

**అవుకు జనవరి 31 ప్రభాత వార్త:**

అవుకు మండల పరిధిలోని రామాపురం గ్రామంలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు రామాపురం గ్రామానికి చెందిన బోయ వెంకట రాముడు (40) ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. యధావిధిగానే గని పనుల నిమిత్తం ట్రాక్టర్ ను గనుల్లోకి తీసుకొని వెళ్లి నాపరాలను లోడ్ చేసుకొని వెళుతుండగా ట్రాక్టర్ ఇంజన్, ట్రాక్టర్ ట్రాలీ విడిపోయాయి. ట్రాక్టర్ ఇంజన్ క్రింద వెంకట్రాముడు పడిపోవడంతో మృతి చెందాడు. మృతుని తమ్ముడు బోయ రవీంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు సంతానం ఉన్నారు.

# చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

**: జిల్లా టిడిపి పార్టీ కార్యదర్శి పి నాగరాజు యాదవ్ హెచ్చరిక**



**కర్నూలు హాస్పిటల్ జనవరి 31 ప్రభాతవార్త:**

అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని టిడిపి నేత నాగరాజు యాదవ్ అన్నారు. చంద్రబాబు నాయుడుపై అనుచితంగా మాట్లాడటం సరికాదని, ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రానున్న 15 సంవత్సరాలు సంవత్సరాలు చంద్రబాబు నాయుడే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు. మీరు ఇలాగే ముందుకు వెళ్తే ప్రజలు తిరగనివ్వరని, ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. అంబటి రాంబాబు నోటికి వచ్చినట్టు మాట్లాడితే టిడిపి కార్యకర్తలు ఊరుకోరని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు సహనంతో ఆగిపోతున్నారని, లేకపోతే వైసిపికి ఈ సమయంలో ఏమి మిగలదని అన్నారు. ఈ సందర్భంగా తెలుగు యువత అధ్యక్షుడు అబ్బాస్ మాట్లాడుతూ, అంబటి రాంబాబు చాలా జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. వెంటనే చంద్రబాబు నాయుడుకు క్షమాపణ చెప్పకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అంబాడి రాంబాబు జస్టిబొమ్మను తగలబెట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# శ్రీమహానందీశ్వరుని హుండి ఆదాయం రూ.37 లక్షలు



**మహానంది, జనవరి 31, ప్రభాతవార్తః**

శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 36 రోజులకు రూ.37,47,126ల ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సమీపిస్తుండడంతో ఉభయ ఆలయాల్లోని హుండిలను శనివారం భక్తులు, సేవకుల ద్వారా లెక్కింపు చేశారు. యుఎస్ ఏ1 రూపాయ డాలర్ 1, ఐదురూపాయల డాలర్లు 2, భూటాన్ 20, వచ్చినట్లు తెలిపారు. ఈహుండి లెక్కింపు కార్యక్రమంలో డీఈవో మోహన్, ఏఈవో మధు, సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, నీలకంటేశ్వరరాజు, సుబ్బారెడ్డి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగ మల్లయ్య, సేవా సమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కైలాసద్వారం వద్ద ఏర్పాట్లు పరిశీలన



**శ్రీశైలంప్రాజెక్టు, జనవరి31,ప్రభాతవార్త :**

ఫిబ్రవరి 8 నుండి 18వ తేది వరకు శ్రీగిరి క్షేత్రంలో జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నేపథ్యంలోనే శనివారంనాడు కైలాసద్వారం వద్ద ఏర్పాట్లను చైర్మన్ పి. రమేష్‌నాయుడు, ఈఓ ఎం. శ్రీనివాసరావులు, అధికారులతో కలసి పరిశీలించారు. కాగా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేసారు. భక్తులకు అవసరమైనన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని చెప్పారు. భక్తులకు అవసరమైన చలువపందిళ్లు, మంచినీరు, వైద్యం, అన్నదానం, విద్యుద్ధీకరణ, తదితర ఏర్పాట్లను పకడ్బందిగా చేయాలని ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ నరసింహారెడ్డి, ఏఈఓ మల్లికార్జునరెడ్డి, శ్రీశైలప్రభ సంపాదకులు డాక్టర్ అనిల్‌కుమార్, డి ఈలు, ఏఈలు, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వరస్వామి లడ్డులో జంతువులకొవ్వు లేదని.. తేల్చిన సిట్

**: చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు క్షమాపణ చెప్పాలి**

**నంద్యాల, జనవరి 31,ప్రభాతవార్త ప్రతినిధి :**



వెంటేశ్వరస్వామి లడ్డులో ఎలాంటి జంతువుల కొవ్వు లేదని సిట్ బృందము తేల్చిందని చంద్రబాబు, పవన్‌కళ్యాణలు క్షమాపన చెప్పాలని నంద్యాల మాజీ యంయల్ఎశిల్పారవిచంద్రకిశోరురెడ్డి డిమాండు చేశారు. శనివారె నంద్యాల పట్టణంలోని గుడిపాటి గడ్డలోవెలసిన వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరము అలయం వెలుపల మీడియా సమావేశము నిర్వహించారు. ఈ సమావేశములోరాష్ట్ర మార్కెఫడ్ మాజీ చైర్మన్ పిపిననాటగిరెడ్డి రాష్ట్ర వైసిపి కార్యదర్శి దేశం సుదాకరరెడ్డి, మున్సుపల్ చైర్మన్ మాబున్నీసా, వైస్ చైర్మన్ గంగిశెట్రిశ్రీదరు, వైసిపి లీగలసెల్ అద్యక్షుడు రామసుబ్బయ్య, తదితరులుయపాల్గొన్నారు. ఈసందర్భముగా శిల్పారవి మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వరస్వామివారిని అడ్డుగా పెట్టుకుని దుష్ట రాజకీయాలు చేస్తున్న చంద్రబాబునాయుడు పవన్‌కళ్యాణ్‌చ, మరియు పచ్చ పార్టి నాయకులకు పాపభీతిలేదన్నారు. పచ్చబుఠాచేసిన ఈ దుర్గార్గ మైన చర్యలను హిందూ సమాజం క్షమించిదన్నారు. హిందువల మనోబావాలను దెబ్బతీసిన సియం చంద్రబాబు,పవన్‌కళ్యాన్ క్షమాపనలు చెప్పాలని డిమాండు చేశారు. తిరుమల లడ్డూ లో జంతువుల కొవ్వు లేదని సిట్ తేల్చిచెప్పడముతో ఇందంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన కుట్రఅని తేలిందన్నారు. ఎన్నికల్లో గెలువడానికి ల్యాండు టైటలింగ్ యాక్ట్ అని ఓడలో గ్రగన్స ఉన్నాయని 30వేల మందిమహిళలు అదృశ్యంఅయ్యారని రాజకీయంగా అడ్డుకోవాలని కుట్రలు పన్ని అనేక అసత్యపు అరోపనలు చేశారని వాటిలో ఒక్కటి కూడా ఏఒక్కరు కూడా రుజువు చేయలేక పోయారన్నారు. చంద్రబాబునాయుడు గెలుపు కోసం అనేక అపబద్దాలను మోస్తు ఎవ్వరినైనా వెన్నుపోటు పోడవడానాకి ముందుంటారని విమర్శించారు. తాను పచ్చమీడియా అడంతో పదే పదే నమ్మించేందుకు ప్రసారాలు చేసి భక్తుల మనోబావాలను దెబ్బతీశారని అందోళ చెందేలా చేశారన్నారు. తిరుమల తిరుపతదేవస్థానానికి చైర్మన్ క్రిష్టయన్లని దుస్ ప్రచారానికి తేరలేపారన్నారు. పరకాయ ప్రవేషం చేసినట్లుగా రాత్రి పడుకొని పొద్దునే రంగులు వేసుకునే స్టేజి పవన్‌కళ్యాన్ మాదిరిగా వీరు కాదని నిజమైన భక్తి విశ్వాసాలు ఉన్న వారని చెప్పారు. తిరుమల వద్ద 2003లో శ్రీవారి చలువ వల్ల అవీర్వాదము వల్ల ప్రాణాలతో బ్రతికొ బయటపడ్డారని గుర్తు చేశారు. తిరుపత లడ్డూలో కల్తీ జరిగిందన్నా అరోపనపై వైవి సుబ్బారెడ్డి సుప్రికోర్టు వెళ్లి సిబిఐ విచారణ పై చేయించాలని కోరడము జరిగిందన్నారు. సిట్ జరిగిన విచారణలో క్లీన్ చిట్ ఇచ్చారని తెలిపారు.

# అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లను అందిస్తాం : ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

**- పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి**



**గడివేముల, జనవరి 31, ప్రభాతవార్త;** అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లను అందిస్తామని, పింఛన్‌దారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రమైన గడివేములలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికి తిరుగుతూ పింఛన్‌లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1వ తేదీ ఆదివారం కావడంతో పింఛన్‌దారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా 31వ తేదీనే ముందస్తుగా పింఛన్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వారి జీవితాల్లో నిజమైన భరోసాగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమలంఠ గడివేముల పీఏసీఎస్ మరియు మాజీ మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ పంట దిలీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, బి.సీతారామిరెడ్డి, జనసేన నాయకులు ధరణి చంద్రమోహన్, రఫీక్, సిరిపి పుల్లారెడ్డి, మద్దిలేటి, గ్రామ నాయకులు ఎస్ఏ రఫీ, ఫరూక్, సుభద్రమ్మ, ఈశ్వరరెడ్డి, సకుమార్ ఆచారి, బి.రమణారెడ్డి, శ్రీకాంత్, డి.సంజీవరెడ్డి, రామచంద్రారెడ్డి, గడివేముల గ్రామ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

- రైతులు అడిగిన వెంటనే నీటిని విడుదల చేయించిన ఎమ్మెల్యే
- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు

పంటలకు నీరు లేవని రైతులు కోరగా, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి చొరవ తీసుకుని కేసీ కెనాల్ నీటిని వదిలి జలహారతి చేశారు. ఈనెల 13వ తేదీ వరకు కేసీ కెనాల్‌కు నీరు అందిస్తామని, ప్రతిరైతు నీటిని పొదుపుగా వాడుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పంట దిలీప్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేశం సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, నీటి సంఘం చైర్మన్ పంట రామచంద్రరెడ్డి, వడ్డు లక్ష్మీదేవి, జనసేన నాయకులు ధరణి చంద్రమోహన్, రఫీ, అన్ని గ్రామాల ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయి - గిత్త జయసూర్య

**పగిడ్యాల, జనవరి 31,ప్రభాతవార్త**



అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయనీ ఎంఎల్ఏ గిత్త జయసూర్య అన్నారు. పగిడ్యాల మండలం ఎం.గణపరం, ఎన్.గణపురం గ్రామాలలో శనివారం ఎన్టీఆర్ బరోసా ఫించన్లను ఎంఎల్ఏ ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ గిత్త జయసూర్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో ప్రవేశపెట్టిన ప్రతిసంక్షేమ పథకం అర్హతకలిగిన అందరికీ అందజేయడం జరుగుతుందన్నారు. రానున్న కాలంలో ప్రతి ప్రభుత్వంచేపట్టిన అభివృద్ధి పథకం ఇంటివద్దకే చేరుతాయన్నారు. ఫించన్ పెంచి 1వతేదీన సెలవు దినాలు వస్తే ముందురోజే పంపిణీ చేసిన ఘనత దేశచరిత్రలోనే ఒక్క సిఎం నారా చద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం చేసిన మోసాలవల్ల అన్ని వర్గాల ప్రజలు ఎంత ఇబ్బందులకు గురిఅయ్యారో వివరంగా వివరించారు. అనతరం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రాతకోటలో డి.లక్ష్మిదేవికి రూ.20వేలు మంజూరైన చెక్కును లబ్దిదారులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ సుమిత్రమ్మ, ఎంఈఓ పి.సుభాన్, ఎపిఎం శ్రీనివాసులు, ఎపిఓ మద్దిలేటి, అయా శాఖల అధికారులు టిడిపి నాయకులు చంద్రేష్, మద్దిలేటిగౌడు, నాగేశ్వరావు, శ్రీను, రమణ, శ్రీనివాసులు, హరికుమార్, వేణుగోపాల్, హరిబాబు, బాలకృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కోసిగి ఎల్లమాంబ జాతర ముందస్తు ఏర్పాట్లు పరిశీలించిన.. డిఎస్పీ



**- భక్తుల శాంతి భద్రతల పరిరక్షణపై సమగ్ర సమీక్ష..**

**కోసిగి, జనవరి 31, ప్రభాతవార్త :**

కోసిగిలో జరుగనున్న రేణుక ఎల్లమాంబ రథోత్సవం పై చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లను ఎమ్మి గనూరు డీఎస్పీ భార్గవి ప్రత్యక్షంగా పరిశీలించారు.. ఈ నెల 7వ తేదిన సంప్రదాయబద్ధంగా జరుగుతున్న ఎల్లమ్మ రథోత్సవంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యంకలుగకుండ ఉండడానికి గానూ ఆయా ప్రాంతాలను సిఐ మంజునాథ్‌తో కలసి డీఎస్పీ భార్గవి పరిశీలించారు.. ఈ సందర్భంగా ఆమెసిఐ మంజునాథ్‌కు, ఎస్ఐ రమేష్‌రెడ్డిలకు పలు అంశాలపై సూచనలు చేసారు..జాతర సమయంలో తగిన బందోబస్తును ఏర్పాటుచేయాలని, భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నియంత్రించాలన్నారు.. రద్దీ ప్రాంతంలో క్యూలైన్లు, నిఘావిభాగంను ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు..ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, మద్యం సేవించి గందరగోళం చేసేవారి పట్ల కఠినంగా ఉండాలన్నారు..అలాగే జాతరకు వచ్చే భక్తులు కూడా పోలీసుశాఖకు సహకరించి పోలీసు సిబ్బంది సూచనలు పాటించాలని డీఎస్పీ కోరారు..



# కల్తీ నెయ్యి కాదు. రాజకీయ కుట్ర

**మంత్రాలయం, జనవరి 31, ప్రభాతవార్త;**

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ప్రస్తుత కూటమి ప్రభుత్వం కల్తీ నెయ్యి అంటోందని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్తీ నెయ్యి అంటూ అబాండాలు వేయడం మానుకోవాలన్నారు. ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం స్వామివారికి టెంకాయలు సమర్పించారు. ఈ సందర్భంగా గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షులు గుర్రెడ్డి భీంరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత న్యాయ సేవలపై అవగాహన సదస్సు




**కర్నూలు లీగల్ , జనవరి 31 ప్రభాతవార్త :**

రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్యదర్శి గారైన బి. లీలా వెంకట శేషాద్రి శనివారం సి.క్యాంపులోని జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీస్ నందు మాజీ సైనికుల కోసం నల్సా వీర్ పరివార్ సహాయత యోజన 2025 లో భాగంగా ఉచిత న్యాయ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లడుతూ దేశ రక్షణ కోసం కృషి చేస్తున్న సైనికులు మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యులకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు కర్నూలు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం నందు లీగల్ ఎయిడ్ క్లినిక్ ను ప్రారంభించామని తెలిపారు. ఈ క్లినిక్ నందు న్యాయ వాది మరియు ప్యారా లీగల్ వాలంటీర్ లు ఉంటారని వీరు మాజీ సైనికుల కు చట్టభద్ధ మైన సమస్య లు ఉంటే వారికి ఉచితంగా న్యాయాన్ని అందించి వారి సమస్య లను పరిష్కరిస్తారని తెలిపారు. మాజీ సైనికులు అందరు ఉచిత న్యాయ సహాయానికి అర్హులని తెలిపారు. ఈ సదస్సు లో కర్నూలు జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్. ఆర్. రత్న రూత్, న్యాయవాది విజయ, ప్యారా లీగల్ వాలంటీర్ మధు సుధన్,మాజీ సైనిక ఉద్యోగులు పాల్గొన్నారు.

# కూటమి నేతలకు సద్బుద్ధి కలగాలని ప్రార్థించాం



**కర్నూలు అర్బన్ జనవరి 31 ప్రభాతవార్త :**

కర్నూలు పాత బస్టాండ్ సమీపంలోని శ్రీ చెన్నకేశ్వర స్వామి దేవాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షులు మరియు కర్నూల్ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే ఎస్.వి. మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో, తిరుమల లడ్డు కల్తీపై కూటమి నేతలు చేసిన అపచారానికి పరిహారంగా ఆలయాన్ని శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీవారి లడ్డూలో జంతు కొవ్వు కలిసిందంటూ తప్పుడు, విష ప్రచారం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన టిడిపి కూటమి నేతల చర్యలను ఖండిస్తూ ఈ కార్యక్రమంలో స్టేట్ మహిళ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి పాల్గొని వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ చేసిన అపచారానికి పరిహారంగా శ్రీవారిని వేడుకుంటూ, వారికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాన్ని శుద్ధి చేసి, కూటమి నేతలకు సద్బుద్ధి కలగాలని ప్రార్థించిన వైఎస్సార్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన కాటసాని

**కర్నూలు అర్బన్ జనవరి 31 ప్రభాతవార్త**

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని ర్నాభూపాల్ రెడ్డి మంగళవారం రోజు జరిగిన 19వ వార్డు గణేష్ నగర్ చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్త ఎరుకల నాగరాజు కుమారుడు అఖిల్ శకుంతల కళ్యాణ మండపం దగ్గర ఉన్న ట్రాన్స్ఫార్మర్ వద్ద ఉన్న రేగి పండ్ల కోసం వెళ్లి కరెంటు షాక్ తగిలి తీవ్రంగా గాయాలైన విషయం విదితమే. కార్యకర్త ఎరుకల నాగరాజు కుటుంబానికి వార్డు నాయకుల ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం కింద రూ. 20,000/ వేలు అందించిన కాటసానిఈ కార్యక్రమంలో 19 వార్డు నాయకులు నల్లబోలు గోపాల్ రెడ్డి, రాజమోహన్ రెడ్డి, చంద్రిక, తిరుమల్, వెంకటేశ్వర రెడ్డి గారు, చిన్న, మరియు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్‌దారులకు ముందుగానే పింఛన్‌ల పండగ..

**- టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ**

**ఆదోనిటౌన్, జనవరి 31, ప్రభాతవార్త;**



రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పింఛన్లను లబ్ధిదారు లకు అందించడంతో పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పేర్కొన్నారు. శనివారం ఆదోని నియోజకవర్గంలోని విరుపాపురం గ్రామంలో ఆమె పింఛన్‌దారుల ఇంటింటికి వెళ్లి పింఛన్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీన ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి పింఛన్‌దారులు ధన్యవాదాలు తెలియజేశారు. పింఛన్‌దారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమలంఠ స్థానిక టీడీపీ మాజీ సర్పంచ్ వీరేష్‌యాదవ్, సీనియర్ నాయకులు కృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.